క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలి



ప్రశంసాపత్రం అందజేస్తున్న వెంకటరమణారెడ్డి, సభ్యులు

రామగిరి: నేత్ర, అవయవ దానాలపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి అన్నారు. సెంటినరికాలనీకి చెందిన వేముల వసంత్ ఇటీవల మృతిచెందగా.. సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో వసంత్ నేత్రాలను దానం చేయడానికి ఆయన కుటుంబ సభ్యులు అంగీకరించారు. బుధవారం వసంత్ సంస్మరణ సభలో ఆయన కుటుంబానికి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సదాశయ ఫౌండేషన్ సలహాదారు నూక రమేశ్, పర్శ బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై అవగాహన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధి ఇందిరనగర్‌లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ సోమరపు లావణ్య మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంతో సమయంతోపాటు తక్కువ ఖర్చుతో ఎన్నికలు నిర్వహించొచ్చని అన్నారు. కవాటి రాజగోపాల్, సుల్వ లక్ష్మీనారాయణ, కాసిపేట శివాజీ, పెద్దపల్లి రవీందర్, మహవది రామన్న, అడ్వకేట్ సితకరి చంద్రశేఖర్, గోపగోయిన నవీన్, సాగి కిషన్‌రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకానికి కేంద్రం ఎసరు



కూలీలతో మాట్లాడుతున్న గణేశ్

మంథని: ఉపాధిహామీ పథకం అమలులో కేంద్రం అనేక నిబంధనలు పెడుతూ కూలీలను శ్రమ దోపిడీకి గురి చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ అన్నారు. బుధవారం గద్దలపల్లి గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఎర్రటి ఎండలో కూలీలు పని చేస్తే కేవలం రూ.50 చెల్లించడం ఏమిటన్నారు. ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పని చేయలేకపోతున్నారని, వాటిని సవరించి ప్రతి కూలీకి రూ.307 అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి ఎసరు పెడుతోందని విమర్శించారు. రామ్‌రెడ్డి, రాజిరెడ్డి, బాలయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్



ధర్మారం: అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న ధర్మారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను బుధవారం ఎక్సైజ్ అధికారి మహిపాల్‌రెడ్డి పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. నూనె ఓదెలు, అమరగోని పోచమ్మ కొన్ని రోజులుగా గుడుంబాను తయారు చేసి విక్రయిస్తుండగా పట్టుకొని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారి మహిపాల్‌రెడ్డి చెప్పారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ధర్మారం: ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో సివిల్ సప్లయ్ అధికారి, కమిషనరేట్ హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా.. లక్సెట్టిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ ప్రభుత్వం సరఫరా చేసే పీడీఎస్ బియ్యంతో పట్టుబడింది. పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు డీసీఎస్‌వో గోపిడి రవీందర్ తెలిపారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన మోతే శేఖర్ ఆదేశాల మేరకు లారీ డ్రైవర్ ఆముదాపురం సతీశ్ లక్సెట్టిపేటకు చెందిన వానరాసి సంపత్, ఉమామహేశ్వర్‌ను కలవగా.. పీడీఎస్ బియ్యం 211.50 క్వింటాళ్లు తన లారీలో లోడ్ చేశారని డ్రైవర్ వివరించినట్లు ఆయన తెలిపారు. డీసీఎస్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకొని భూసమస్యలను పరిష్కరించుకోవాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య సూచించారు. లోకపేట, ర్యాకల్‌దేవుపల్లి, శివపల్లి గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులను సందర్శించారు. లోకపేటలో 1, ర్యాకల్‌దేవుపల్లి 16, శివ పల్లిలో 42 దరఖాస్తులను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐలు జయలక్ష్మి, చంద్రశేఖర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వ్యాధులు పొంచి ఉన్నాయి జాగ్రత్త..

సుల్తానాబాద్: వాతావరణంలో మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున ప్రజలు, కార్మికులు జాగ్రత్తలు పాటిస్తే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఎండాకాలం తీవ్రత అధికంగా ఉండడంతోపాటు ఈదురుగాలుల ప్రభావం తీవ్రంగానే ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత, రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చల్లని గాలులతోపాటు వడ గాలులు వీస్తున్నాయి. ఎండ దెబ్బ తగలకుండా ఉండేందుకు చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సుల్తానాబాద్, పెద్దపల్లిలో ఓపీ సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. సుల్తానాబాద్‌లో 250 నుంచి 300 కాగా.. పెద్దపల్లిలో 400 నుంచి 450కి చేరుకుంది.

ముఖ్యంగా పిల్లలు..

పగటిపూట వేడి, రాత్రిపూట చల్లని గాలులు పిల్లల శరీరంపై ఒత్తిడిని కలిగించి వారి రోగ నిరోధక శక్తిని ప్రభావితం చేస్తున్నాయి. పిల్లల్లో జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. వాతావరణంలో ఆకస్మిక మార్పులు వైరస్, ఇన్‌ఫెక్షన్‌కు దారి తీస్తున్నాయి. అస్తమా, ఎలర్జీ అన్న పిల్లలకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దగ్గు, గురక వంటివి సంభవిస్తాయి. వీటి నివారణకు రోజంతా తగినంత నీరు తాగేలా చూడాలి. ఉదయం చల్లని గాలులు, మధ్యాహ్నం వేడి తీవ్రతకు తగిన దుస్తులు వేయాలి.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)

బయటకు రావొద్దు

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండడంతో వృద్ధులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఉదయం చల్లని గాలులకు శ్వాసకోశ, కీళ్ల నొప్పులు, జలుబు, జ్వరం రానున్నాయి. మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రత వల్ల డీహైడ్రేషన్, రక్తపోటులో మార్పులు సంభవిస్తాయి. వీటిని ఎదుర్కొనేందుకు తగినంత నీరు తాగాలి. ఎండలో బయటకు వెళ్లకపోవడం మంచిది.

రైతులు, కూలీలు..

రైతులు, కూలీలు అధిక సమయం ఎండలో పని చేయడం వల్ల శరీరం వేడెక్కి చెమటలు పట్టడం, తలనొప్పి, మైకం లేదా స్పృహ కోల్పోవడం వంటివి జరుగుతాయి. ఇది ఒక్కోసారి ప్రాణాంతకం కావచ్చు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విశ్రాంతి తీసుకోవాలి. తరచూ నీరు, నిమ్మరసం, ఓఆర్ఎస్ ఇవ్వాలి. టోపీ, గొడుగు లేదా తడిగుడ్డ వాడాలి.

రోగుల సంఖ్య పెరిగింది



ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరుగుతోంది. ఎండ తీవ్రత వల్ల జాగ్రత్తలు పాటించడం మంచిది. వేసవి కాలం ప్రారంభ సమయంలోనే జరిగే వాతావరణంలో మార్పుల వల్ల కొన్నాళ్లుగా సుల్తానాబాద్, పెద్దపల్లిలో రోగుల సంఖ్య పెరిగింది. ఎక్కువ సంఖ్యలో జ్వరం, జలుబుతో వస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స అందించి కోలుకోగానే పంపిస్తున్నాం. వాతావరణం మార్పుల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల నుంచి బయటపడొచ్చు.

– డాక్టర్ శ్రీధర్, డీసీహెచ్, పెద్దపల్లి

పిల్లలను ఎండలో తింపొద్దు



ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున చిన్న పిల్లలను ఎండలో తింపొద్దు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పిల్లలకు జ్వరాలు, విరోచనాలు వచ్చే అవకాశముంది. తప్పనిసరిగా చిన్న పిల్లలు కాటన్ దుస్తులు ధరించేలా చూడాలి. అనారోగ్య సమస్య వస్తే వెంటనే చిన్న పిల్లల డాక్టర్లను సంప్రదించాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం.

– డాక్టర్ రాజు, ప్రభుత్వ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యుడు, సుల్తానాబాద్

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

రామగుండం: కార్మిక, కర్షక రంగ సమస్యలపై కేంద్రం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ ప్రతినిధులు కోరారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ తీన్‌రస్తా కూడలిలో సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. సీఐటీయూ ప్రతినిధులు భిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, మామిడి సతీశ్, ఎల్లయ్య, మార్త పోశం, కీర్తి వెంకటేశ్, దాసరి కృష్ణ తదితరులున్నారు.

జ్యోతినగర్: దేశవ్యాప్త సమ్మెను కార్మిక వర్గం విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి, ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో విధులు నిర్వహించే మున్సిపల్ కార్మికులతో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గుంటి నాగభూషణం, రంగు శ్రీనివాస్, మున్సిపల్ నాయకులు లక్ష్మణ్, లక్ష్మి పాల్గొన్నారు.

పెద్దపల్లిరూరల్: రైల్వే హమాలీలుగా పని చేస్తున్న వారిని 4వతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని రైల్వే స్టేషన్ వద్ద హమాలీ కార్మికులకు బుధవారం కరపత్రాలను అందజేశారు. రైల్వే కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి సంపత్, డైరెక్టర్ మోహన్, శ్రీశైలం, వెంకటేశ్, రవి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సుల్తానాబాద్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సుగ్లాంపల్లితోపాటు కార్మికులకు కరపత్రాలను అందజేసి ఆవిష్కరించారు. వివిధ యూనియన్ల నాయకులు పోగుల తిరుపతి, మాతంగి రాజమల్లు, ప్రసాద్, సమ్మయ్య, నర్సయ్య, శంకర్, తిరుపతి, రాజయ్య, మల్లయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



రామగుండం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

కొనుగోలు కేంద్రాల్లో క్షేత్ర పరిశీలన

రామగుండం: ఇటీవల కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యంపై రైతులు త్వరితగతిన చేపట్టాల్సిన చర్యలపై బుధవారం అంతర్గాం మండల వ్యవసాయాధికారులు క్షేత్ర పరిశీలన చేపట్టారు. లింగాపూర్, గోలివాడ, పెద్దంపేట, ఎల్లంపల్లి తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం స్థితిగతులను పరిశీలించారు. ముందుగా తడిసిన ధాన్యం ఆరబెట్టి మొలకెత్తకుండా సన్న ఉప్పు పొడిని చల్లాలని పలు సూచనలు, సలహాలు, చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మరో రెండు రోజులు అకాల వర్ష సూచన ఉండడంతో రైతులు టార్పాలిన్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల వ్యవసాయాధికారి సతీశ్, ఏఈవో రమేశ్ ఉన్నారు.



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి

సర్కారు బడిలో చేర్పించాలి



మహిళా సంఘ ప్రతినిధులతో సమావేశమైన ఎంఈవో సురేంద్రకుమార్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు మీవంతుగా సాయమందించాలని మండల విద్యాధికారి సురేంద్రకుమార్ స్వశక్తి మహిళా సంఘ ప్రతినిధులను కోరారు. రాఘవాపూర్‌లో బుధవారం ఉషోదయ గ్రామైక్య సంఘ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. హెచ్ఎం హన్మంతు, సీఆర్‌పీలు, సంఘం అధ్యక్షురాలు తిరుమల తదితరులున్నారు.

బోధనలో నాణ్యత పెంచేలా..

- ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు
- వెనకబడిన తరగతి విద్యార్థుల గుర్తింపు

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు బోధన, పాఠ్య పుస్తకాలు, డ్రెస్సులు, బోధన సామర్థ్యం పెంపు, సాంకేతికత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతోంది. ఎన్‌సీఈఆర్‌టీ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అసైన్మెంట్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్) 2021లో జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ఫలితాలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. అందుకు గల కారణాలను గుర్తించి వాటిని మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేపట్టింది.

సెలవు దినాల్లో..

పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో ఉపాధ్యాయులకు వేసవి సెలవుల దినాల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రారంభమైన శిక్షణ తరగతులు ఐదు రోజులు కొనసాగుతాయి. జిల్లాలో విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసన ఫలితాలను పెంపొందించడం లక్ష్యంగా రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. జిల్లా రిసోర్స్‌పర్సన్లకు ఇటీవల రాష్ట్రస్థాయిలో ఐదు రోజులు శిక్షణ ఇచ్చారు. జిల్లాలో పలువురు డీఆర్‌పీలు జిల్లావ్యాప్తంగా ఉన్నారు. కంటెక్స్చువల్ గ్రామర్, ప్రాజెక్టు బేస్డ్ లెర్నింగ్, డెవలపింగ్ రిఫ్లెక్టింగ్ థింకింగ్, ఎక్సటెన్సివ్ రీడింగ్, స్ట్రాటజీస్ ఫర్ స్ట్రగుల్‌ఇంగ్ రీడర్స్ తదితర అంశాలు రిసోర్స్‌పర్సన్ల ద్వారా నేర్చుకొని ఆంగ్లం విషయానికి సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తగిన విధంగా పాఠ్య పుస్తకంలో పొందుపరిచిన బోధన వ్యూహాలు తూచ తప్పకుండా అమలు చేయాలి. రిసోర్స్‌పర్సన్లు చెప్పే అంశాలు నోట్స్ తయారు చేసుకొని లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ వంద శాతం ఉపయోగించి టెక్నాలజీ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేయాలి. రికార్డు మెయింటెయిన్ చేయాలి. తరగతి గదిలో నేర్చుకొనే వాతావరణాన్ని కల్పించడం ఉపాధ్యాయుల బాధ్యత. ఈ కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలో ఉపాధ్యాయుల ఆంగ్ల బోధనా తరగతి అనుభవాల కేసు స్టడీ, తరగతి గది వ్యక్తిగత అనుభవాలు, బృంద చర్చలు, నూతనమైన, సృజనాత్మకమైన విద్యాప్రణాళికలు రూపొందించుకొని అభ్యసన ఫలితాలు సాధించేలా బోధన చేసి విద్యాభివృద్ధి కృషికి ఏర్పాటు చేస్తున్న ఇన్‌సర్వీస్ ట్రైనింగ్ ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలి.



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పట్టు సాధించేలా..

తెలుగు, ఇంగ్లిష్, గణితం, హిందీ, భౌతిక, రసాయన, జీవశాస్త్రాలు, సాంఘిక శాస్త్రం, వ్యాయామ ప్రత్యేక విద్యను నలుగురు చొప్పున విద్యార్థులకు ప్రత్యేక బోధనలు చేయనున్నారు. సైన్స్‌లో విద్యార్థులు పట్టు సాధించేలా పాఠశాల ప్రారంభంలోనే వెనకబడ్డ విద్యార్థులను గుర్తించి వారికి పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా నిత్యం చదివించి, రాయించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. ప్రాథమిక స్థాయిలో ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు, ఉన్నత స్థాయిలో ప్రతి మండలం నుంచి నలుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరిచేలా..

సాంకేతికత పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ స్కానర్ బోర్డులను సద్వినియోగం చేసుకోవడం, కృత్రిమ మేధ(ఏఐ)ను అందిపుచ్చుకోవడం, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు, ఆకర్షణీయమైన బోధనాభ్యసన ప్రక్రియలను రూపొందించడం, బడి అభివృద్ధిలో భాగస్వాములు చేయడం, పాఠశాల వనరులను సమర్థవంతంగా నిర్వహించడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వినూత్న వ్యూహాలు, కొత్త బోధన పద్ధతులను మరింత బలోపేతం చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశం.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం వేసవి కాలంలో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ప్రతీ ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలి. విద్యాప్రమాణాలు పెంచడంతోపాటు వెనకబడిన విద్యార్థులను గుర్తించాలి. పాఠశాల ప్రారంభంలోనే వారిపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది.

– మాధవి, జిల్లా విద్యాధికారి, పెద్దపల్లి

వసూళ్లకు పాల్పడితే చర్యలు

రామగుండం: సర్టిఫికెట్ల పేరుతో అదనపు వసూళ్లకు పాల్పడే ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలపై చర్యలు తప్పవని మండల విద్యాధికారి చంద్రయ్య అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పదోతరగతి పూర్తి చేసుకొని ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులు స్టడీ, టీసీ, పదోతరగతి మెమో ఇతరత్రా సర్టిఫికెట్లిచ్చే క్రమంలో అక్రమ వసూళ్లకు పాల్పడడం, తల్లిదండ్రులపై ఒత్తిడి చేయడం తదితర విషయాలు తన దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

దరఖాస్తులు ఆహ్వానం

కాల్వశ్రీరాంపూర్: మల్యాల మోడల్ స్కూల్లో పదోతరగతి ఉత్తీర్ణులై ఇంటర్‌మీడియట్ వివిధ గ్రూపుల్లో చేరాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పోచయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ ప్రతి గ్రూపులో 40 సీట్లున్నాయని, అర్హత ఉన్న విద్యార్థులు ఈనెల 20 లోగా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందొచ్చన్నారు.

రైతులకు అండగా కాంగ్రెస్ సర్కారు



రైతులతో మాట్లాడుతున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: రైతులకు అండగా కాంగ్రెస్ సర్కారు ఉంటుందని సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి అన్నారు. బుధవారం వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన వరి ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన పంట ఉత్పత్తులు అకాల వర్షాలకు తడిసి నష్టపోకుండా త్వరితగతిన కాంటాలు నిర్వహించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మాజీ ప్రజాప్రతినిధులు బంగారి రమేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



రామగుండం: మల్యాలపల్లి గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశముందని గ్రామస్తులు వాపోతున్నారు. రాబోయే వర్షాకాలంలో దాని పక్కనే ఉన్న పశువుల పాకకు వెళ్లే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశముంటుంది. టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్ కమిటీ ఎన్నిక



లేఖ అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 బేస్ వర్క్‌షాప్ ఐఎన్‌టీయూసీ ఫిట్ కమిటీని బుధవారం నియమించారు. నియామకం లేఖను ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్ ఫిట్ కమిటీ సెక్రటరీ కర్క శ్రీనివాస్‌కు అందజేశారు. యూనియన్ నాయకులు అక్రం, దశరథంగౌడ్, అనంతరాములు, కుంట తిరుపతి, వంగల సంజీవరెడ్డి, సుంకర శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్, పానగంటి కుమార్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఓసీపీ–1లోని భారీ యంత్రాల్లో పని చేసే ఏసీలు ఏర్పాటు చేసి ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూడాలని బీఎంఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిన్నమనేని వేణుగోపాల్‌రావు అన్నారు. బుధవారం ఓసీపీ–1 సైటాఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. షావల్స్, డ్రిల్స్ యంత్రాల్లో ఏసీ యూనిట్లు పని చేయడం లేదని, దీంతో ఉత్పత్తి దెబ్బతింటోందన్నారు. ఎస్అండ్‌డీ సెక్షన్‌లో ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రాజెక్టు చుట్టూ వన్యప్రాణుల కోసం నీటి తొట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాజెక్ట్ క్వారీలో వేసవి కాలంలో రెస్ట్ షెల్టర్ల టాప్‌పై ఫ్యాబ్రిక్‌తో కూడిన మెటీరియల్ టాప్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. ఆర్జీ–3 ఉపాధ్యక్షుడు అరుకాల ప్రసాద్, బ్రాంచ్ కార్యదర్శి రౌతు రమేశ్, ఫిట్ కార్యదర్శి రాజమహేందర్‌రెడ్డి, అనుప రమేశ్, పాక కృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ సెక్టార్–3 సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ బోధనలో చేరేందుకు అడ్మిషన్లను ప్రారంభించినట్లు ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, పాఠశాల కరస్పాండెంట్, అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను 1వతరగతి నుంచి 9వతరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్‌లో విద్యాబోధనకు అనుమతులు రావడంతో పాఠశాలలో సీబీఎస్ఈ బోధనకు అనుకూలంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 25 లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎన్.సుధాకర్‌రావు

రామగిరి: ఈనెల 18న ఆర్జీ–1 ఏరియాలోని గోదావరిఖనిలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు వినియోగించుకోవాలని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్‌రావు సూచించారు. బుధవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ గనులు, విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. రామగుండం రీజియన్‌లోని ఆర్జీ–1, 2, 3 పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పించేందుకు సింగరేణి సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంనాయక్ సూచనల మేరకు జాబ్ మేళా ఏర్పాటు చేశామన్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగుల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళా నిరుద్యోగ యువతకు చక్కని అవకాశమని, గోదావరిఖని పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈనెల 18న ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తారన్నారు. 18 నుంచి 30 సంవత్సరాల్లోపు 7వతరగతి నుంచి పీజీ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం బి.వి.సత్యనారాయణ, విభాగాధిపతులు చంద్రశేఖర్, రాజారెడ్డి, సుదర్శనం, రాజేంద్రకుమార్, గుర్రం శ్రీహరి, శ్యామల, అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కాల్వశ్రీరాంపూర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఇదులాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం మేరకు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.1,28,780 నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. సిబ్బంది శ్రీశైలం, లక్ష్మిరాజం, సదానందం, మునీర్‌పాషా పాల్గొన్నారు.



ట్రాక్ పునరుద్ధరించారు.. తారు మరిచారు..

రామగుండం: మల్యాలపల్లి గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న రైల్వే ట్రాక్ వద్ద తవ్వి ఇటీవల పునరుద్ధరణ పనులు చేపట్టిన అధికారులు.. ఆ తర్వాత సాఫీగా రాకపోకలు సాగేలా తారు వేయడం మరిచారు. గోదావరిఖని బొగ్గు గనులకు వెళ్లే రైల్వే ట్రాక్ మల్యాలపల్లి మీదుగా ఉంది. దానికి కనీసం గేటు కూడా లేకపోవడంతో గేట్‌మెన్ సహాయంతోనే రైలును పంపిస్తున్నారు. బొగ్గు ఎగుమతులతో రైల్వే శాఖ రూ.కోట్ల ఆదాయం గడిస్తున్నా.. కనీసం రైల్వే భూగర్భ వంతెన నిర్మించలేదు. పునరుద్ధరణ పనులు చేపట్టిన తర్వాత రైలు పట్టాల మీదుగా వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతుండగా.. కనీసం సవ్యంగా రాకపోకలు సాగేలా తారు రోడ్డు నిర్మించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.